# కరెంట్ అఫైర్స్

1. ఉత్తర భారతదేశంలో అతి పెద్ద వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఇటీవల ఏ రాష్ట్రంలోని కురుక్షేత్రలో నిర్మించారు? (నిర్మల్ సేథియా ఫౌండేషన్ సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మించిన ఈ ఆలయంలో 2018, జులై 1న విగ్రహ ప్రతిష్ఠ, శ్రీవారి కల్యాణం ఘనంగా జరిగాయి. రుషికేష్, దిల్లీల్లో ఇప్పటికే తితిదే ఆలయాలు ఉన్నాయి. ఈ రెండింటి కంటే కురుక్షేత్రలో ఉన్నదే పెద్ద ఆలయం.)

1) రాజస్థాన్ 2) ఉత్తర్ ప్రదేశ్ 3) హరియాణా 4) పంజాబ్

2. ఈసీఐఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (దేబాశిష్ దాస్ స్థానంలో ఈ నియామకం జరిగింది.)

1) సంజయ్ చౌబే 2) అతుల్ గార్గ్ 3) శివ్ శంకర్ 4) నీరజ్ పాండే

3. నవ్యాంధ్ర నాలుగో డీజీపీగా 2018, జూన్ 30న ఎవరు బాధ్యతలు స్వీకరించారు?

1) గౌతమ్ సవాంగ్ 2) ఆర్పీ ఠాకూర్ 3) వీఎస్‌కే కౌముది 4) ఎన్‌వీ సురేంద్రబాబు

4. రాబోయే పార్లమెంట్ సమావేశాల నుంచి ఒక్కో లోక్‌సభ సభ్యుడు రోజుకు ఎన్ని ప్రశ్నలు మాత్రమే అడగాలని ఇటీవల లోక్‌సభ కార్యాలయం వెల్లడించింది? (ఇప్పటివరకూ రోజుకు ఒక్కో సభ్యుడు పది ప్రశ్నలు అడిగే వీలుంది. సభ్యులందరికీ ప్రశ్నలు అడిగే అవకాశం రావాలనే ఉద్దేశంతో ప్రశ్నల పరిమితిని తగ్గించారు. ఇకనుంచి ఒకవేళ సభ్యుడు తాజాగా ప్రకటించిన పరిమితికి మించి ప్రశ్నలు అడిగేందుకు నోటీసులు ఇస్తే వాటిని అడిగేందుకు తర్వాతి రోజు అనుమతిస్తారు.)

1) 8 ప్రశ్నలు 2) 7 ప్రశ్నలు 3) 6 ప్రశ్నలు 4) 5 ప్రశ్నలు

5. మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఇటీవల ఏ రోజున ఎత్తారు? (సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఏటా ఈ రోజున బాబ్లీ గేట్లను ఎత్తి, తెలంగాణకు గోదావరి నీటిని అందిస్తారు. అక్టోబరు 28 వరకు గేట్లను తెరచి ఉంచుతారు)

1) 2018, జులై 1 2) 2018, జులై 3 3) 2018, జులై 5 4) 2018, జులై 7

6. తెలంగాణలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ఏ రోజున ప్రారంభించారు? (పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పురపాలక పట్టణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ సిరిసిల్లలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలి విడతలో 2.90 లక్షల యూనిట్ల గొర్రెలను పంపిణీ చేసిన ప్రభుత్వం, రెండో విడతలో 1.50 లక్షల యూనిట్లను పంపిణీ చేయాలని నిర్ణయించింది. రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంస్థ డైరెక్టర్ వి. లక్ష్మారెడ్డి.)

1) 2018, జులై 1 2) 2018, జులై 2 3) 2018, జులై 3 4) 2018, జులై 4

7. స్విస్ నేషనల్ బ్యాంకు (ఎస్ఎన్‌బీ) తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2017లో వివిధ దేశాల పౌరులు స్విస్ బ్యాంకుల్లో జమచేసిన సొమ్ము విషయంలో భారత్ ఎన్నో స్థానంలో నిలిచింది? (యూకే, అమెరికా తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి.)

1) 53 2) 63 3) 73 4) 83

8. జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఛైర్మన్‌గా నియమితులైన సుప్రీంకోర్ట్ మాజీ న్యాయమూర్తి ఎవరు? (2018, జులై 6న ఈయన సుప్రీంకోర్ట్ న్యాయమూర్తిగా పదవీ విరమణ చేయగానే కేంద్ర ప్రభుత్వం ఆయన్ను ఎన్జీటీ ఛైర్మన్‌గా నియమించింది. పదవీకాలం అయిదేళ్లు).

1) జస్టిస్ ఎం.బి.లోకుర్ 2) జస్టిస్ ఆర్.పి.సింగ్
3) జస్టిస్ ఎల్.ఎన్.రావు 4) జస్టిస్ ఎ.కె.గోయల్

9. 2018 జులైలో అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికిన ఆండ్రెస్ ఇనియెస్టా ఏ దేశ క్రీడాకారుడు? (2010 ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఫైనల్లో ఇనియెస్టా కొట్టిన గోల్‌తోనే అతడి జట్టు విశ్వ విజేతగా నిలిచింది.)

1) బెల్జియం 2) స్పెయిన్ 3) ఫ్రాన్స్ 4) బ్రెజిల్

**10.** ఇటీవల ఏ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 'సంతోష పాఠ్య ప్రణాళిక'ను (హ్యాపీ కరిక్యులమ్) ప్రవేశపెట్టింది? (విద్యార్థులకు విలువలతో కూడిన విద్యతో పాటు ధ్యానం మానసిక ప్రశాంతతను అందించే లక్ష్యంతో రూపొందించిన ఈ పాఠ్య ప్రణాళికను 2018, జులై 2న ప్రముఖ బౌద్ధ మత గురువు దలైలామా, అక్కడి ముఖ్యమంత్రి కలిసి ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 8వ తరగతి వరకు ఈ 'హ్యాపీనెస్' పీరియడ్ 45 నిమిషాల పాటు ఉంటుంది.)

1) ఢిల్లీ 2) గుజరాత్ 3) ఉత్తర్ ప్రదేశ్ 4) పుదుచ్చేరి

**11.** 2018, జులై 3న ఏ జట్టు ఓపెనర్ అరోన్ ఫించ్ జింబాబ్వేతో జరిగిన టీ 20 మ్యాచ్‌లో 76 బంతుల్లోనే 172 పరుగులు చేసి ప్రపంచ రికార్డు సృష్టించాడు? (తన పేరిట ఉన్న 156 పరుగుల అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును ఫించ్ బద్దలు కొట్టాడు.)

1) దక్షిణాఫ్రికా 2) ఇంగ్లండ్ 3) ఆస్ట్రేలియా 4) న్యూజిలాండ్

**12.** ఎన్నికల సమయంలో జరిగే అక్రమాలను అరికట్టడంలో తోడ్పడేందుకు వీలుగా 2018, జులై 3న ఎన్నికల సంఘం ప్రారంభించిన సరికొత్త యాప్ ఏది? (డబ్బులు పంచడం, ఓటర్లను ప్రలోభ పెట్టడం, విద్వేషపూరిత ప్రసంగాలు చేయడం లాంటి వాటికి సంబంధించిన వీడియోలు, ఫొటోలను గుట్టుగా పంపించగలిగేలా ఈ విశిష్ట యాప్‌ను రూపొందించారు.)

1) బ్లో విజిల్ 2) గో విజిల్ 3) సీ విజిల్ 4) త్రూ విజిల్

**13.** భారత్ – పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనలను పరిశీలించే ఐక్య రాజ్య సమితి (ఐరాస) విభాగానికి అధిపతిగా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (ఈయన ఉరుగ్వే ఆర్మీ మాజీ అధికారి. ప్రస్తుతం ఈ బాధ్యతలు నిర్వహిస్తున్న స్వీడన్‌కు చెందిన మేజర్ జనరల్ పెర్ గుస్తాఫ్ లోడిన్ స్థానంలో ఈయన నియమితులయ్యారు.)

1) జోస్ ఎలాడియో అక్లెయిన్ 2) ఆంటోనియో గుటెరస్

3) జాన్ మాన్యుయల్ బర్రోసా 4) అల్తాఫ్ పాప్ జగిర్

**14.** 2018 – 19 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎన్ని పంటలకు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరలను ప్రకటించింది? (ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రకటించినట్లుగానే ఈ పంటలకు పెట్టుబడి వ్యయంపై 50 శాతానికి పైగా లాభం వచ్చేలా ధరలు నిర్ణయించింది. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేసే దిశగా కనీస మద్దతు ధరలు పెంచింది.)

1) 10 2) 12 3) 14 4) 16

**15.** ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు (ఆర్‌ఆర్‌బీ) ఏ సంవత్సరం వరకూ మూలధన సాయం పథకాన్ని కొనసాగించాలని ఇటీవల కేంద్రం నిర్ణయించింది? (ఆర్‌ఆర్‌బీలకు మూలధన సాయం పథకాన్ని ప్రభుత్వం 2010 – 11లో ప్రారంభించింది.)

1) 2018 – 19 2) 2019 – 20 3) 2020 – 21 4) 2021 – 22

**16.** 3 లక్షల ఎన్టీఆర్ నూతన గృహ ప్రవేశాల మహోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏ రోజున నిర్వహించారు? (విజయవాడ పశ్చిమ నియోజకవర్గం మినహా రాష్ట్రంలోని 174 నియోజకవర్గాల్లో ఈ గృహ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానం నుంచి సీఎం చంద్రబాబు గృహప్రవేశాలను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఏర్పాటై ఈ రోజుకు 40 సంవత్సరాలు అయ్యాయి.)

1) 2018, జులై 1 2) 2018, జులై 3 3) 2018, జులై 5 4) 2018, జులై 7

**17.** 2018, జులై 6న ఇక్రిశాట్ విడుదల చేసిన వంగడం 'పర్బనీ శక్తి' ఏ పంటకు సంబంధించింది? (ఈ వంగడంలో సూక్ష్మ పోషకాలైన జింక్, ఐరన్ అధికంగా ఉంటాయి. పోషకాహార లోపాన్ని నివారించడంలో ఇవి కీలకం. ప్రొటీన్ 12 శాతం ఉంటుంది. వీటివల్ల పదేపదే ఆహారం తీసుకోవడం తగ్గుతుంది. దీంతో ఊబకాయం సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ఈ పంటను ఆహారంగా తీసుకున్నప్పుడు శరీరానికి సూక్ష్మపోషకాలు సంపూర్ణంగా అందుతాయి.)

1) వరి 2) సజ్జ 3) కంది 4) జొన్న

**18.** ఎయిర్ నేవిగేషన్ సేవలు, ఎయిర్ స్పేస్ మేనేజ్‌మెంట్, ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ తదితర విభాగాల్లో పరిశోధనలు జరిపి దేశీయ సొల్యూషన్లు అభివృద్ధి చేసేందుకు వీలుగా పౌర విమానయాన పరిశోధన సంస్థకు (కారో) 2018, జులై 5న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి సురేష్ ప్రభు ఏ నగరంలో శంకుస్థాపన చేశారు?

1) ముంబయి 2) దిల్లీ 3) బెంగళూరు 4) హైదరాబాద్

**19.** గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యం కోసం తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ 'గిరిబాల వికాస్' పథకాన్ని ఏ రోజున ప్రారంభించింది? (ఇందులో భాగంగా గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులకు ఏడాదిలో మూడుసార్లు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిస్థితిని అంచనా వేస్తారు. స్వల్ప, దీర్ఘకాల సమస్యలను ముందుగానే గుర్తించి ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో అవసరమైన వైద్యం అందించే లక్ష్యంతో పథకాన్ని అమలు చేయనున్నారు.)

1) 2018, జులై 2 2) 2018, జులై 4 3) 2018, జులై 6 4) 2018, జులై 8

**సమాధానాలు**

1-3; 2-1; 3-2; 4-4; 5-1; 6-2; 7-3; 8-4; 9-2; 10-1; 11-3; 12-3; 13-1; 14-3; 15-2; 16-3; 17-4; 18-4; 19-3.

## ఐసీసీ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు

క్రికెట్‌కు అపూర్వ సేవలు అందించిన భారత మాజీ కెప్టెన్, మిస్టర్ డిపెండబుల్ రాహుల్ ద్రావిడ్, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్, ఇంగ్లండ్ మహిళా క్రికెటర్ క్లెయిర్ టేలర్‌లు ఐసీసీ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు సంపాదించారు. భారత్ తరఫున ఈ ఎలైట్ జాబితాలో చోటు సంపాదించిన అయిదో ఆటగాడు ద్రావిడ్. గతంలో బిషన్‌సింగ్ బేడీ, సునీల్ గవాస్కర్, కపిల్‌దేవ్, అనిల్ కుంబ్లే హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు సంపాదించారు.

## దేశంలో 19,569 మాతృభాషలు, మాండలికాలు

2011 జనాభా లెక్కలపై రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం దేశంలో 19,569 భాషలు లేదా మాండలికాల్లో మాట్లాడుతున్నట్లు తేలింది. మొత్తం జనాభాలో 10 వేలు లేదా అంత కంటే ఎక్కువ మంది మాట్లాడే భాషలు 121 మేర ఉన్నాయి.

- దేశ జనాభాలోని 96.71 శాతం మందికి ఎనిమిదో షెడ్యూల్‌లోని 22 భాషల్లో ఏదో ఒకటి మాతృభాషగా ఉంది.
- 19,569 మాతృభాషలు, మాండలికాల్లో 1369 భాషలను హేతుబద్ధీకరించిన మాతృభాషలుగా గుర్తించారు. 1474 భాషలను వర్గీకరణలో లేనివిగా ప్రకటించారు. వీటిని 'ఇతర' మాతృభాషల విభాగంలో చేర్చారు.
- దేశంలోని అత్యధికులు సంభాషించే మాతృభాషల్లో తెలుగు మూడో స్థానం నుంచి నాలుగో స్థానానికి పడిపోయింది. తెలుగు స్థానాన్ని మరాఠీ భర్తీచేసి మూడో స్థానానికి చేరుకుంది. మొత్తం జనాభాలో 43.63 శాతం మంది మాతృభాష హిందీ. 8.30 శాతం బెంగాలీ, 7.09 శాతం మరాఠీ, 6.93 శాతం మంది తెలుగు, 5.89 శాతం మందికి తమిళం మాతృభాషగా ఉన్నాయి.

## ఇస్రో ప్యాడ్ అబార్ట్ పరీక్ష విజయవంతం

మానవసహిత అంతరిక్ష యాత్రల దిశగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కీలక ముందడుగు వేసింది. అంతరిక్ష నౌకలను ప్రయోగించే సమయంలో తలెత్తే ప్రమాదాల నుంచి వ్యోమగాముల ప్రాణాలను రక్షించేందుకు ఇస్రో 'సిబ్బంది సురక్షిత నిర్గమన వ్యవస్థ'ను (క్రూ ఎస్కేప్ సిస్టమ్) రూపొందించింది. సదరు వ్యవస్థ సమర్థత, విశ్వసనీయతలను విశ్లేషించడానికి వరుసగా పరీక్షలను చేపట్టాలని నిర్ణయించింది.

- ఇందులో భాగంగా మొదటి ప్యాడ్ అబార్ట్ పరీక్షను 2018, జులై 5న ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో ఉన్న సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో విజయవంతంగా నిర్వహించింది.

## మెక్సికో దేశాధ్యక్షుడిగా ఆండ్రెస్ మాన్యుయెల్ లోపెజ్ అబ్రేడర్

నేషనల్ రీజనరేషన్ మూవ్‌మెంట్ పార్టీ నేత, 64 ఏళ్ల వామపక్ష దిగ్గజం ఆండ్రెస్ మాన్యుయెల్ లోపెజ్ అబ్రేడర్ (ఆమ్లో) 2018, జులై 2న మెక్సికో దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అధ్యక్ష ఎన్నికల్లో ఈయనకు సుమారు 53% ఓట్లు లభించాయి. దేశ ఆధునిక చరిత్రలో ఓ అధ్యక్ష అభ్యర్థికి సగానికి పైగా ఓట్లు పోలవ్వడం ఇదే ప్రథమం. 2018, డిసెంబరు 1న ఆమ్లో మెక్సికో దేశాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

**రచయిత: సీహెచ్. కృష్ణ ప్రసాద్**